క్లుప్తంగా

ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కీలకం


యండగండి అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే నిర్వహిస్తున్న దృశ్యం.

ఉండి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల కోసం నిర్వహించే ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ ఎంతో కీలకమని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. శనివారం యండగండి అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే (ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ ఎడ్యుకేషన్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.సుజాత, ఆర్. చిట్టి మరియమ్మ పాల్గొన్నారు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు


ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ విద్యార్థులకు ఈ బ్యాంకింగ్, టాలీ సర్టిఫికెట్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు కళాశాల ప్రిన్సిపల్ వీకేజే ప్రసూన అన్నారు. శనివారం కళాశాలలో కోర్సులను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. అలాగే కళాశాల విద్యార్థులందరికీ ఆఫీస్ టూల్స్‌లో సర్టిఫికెట్ కోర్సులు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ఎస్ లక్ష్మీకాంతం , అధ్యాపకులు ఉమామహేశ్వరి, జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఆర్‌కు ఘన నివాళి


జీవీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశం చౌక్): మున్సిపల్ మాజీ చైర్మన్ గ్రంధి వెంకటేశ్వరరావు (జీవీఆర్) తృతీయ వర్ధంతి కార్యక్రమం భీమవరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఆయన కుటుంబ సభ్యులు పేదలకు చీరలు పంపిణీ చేశారు. టీటీడీ బధిర పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి, పండ్లు అందజేశారు. అనంతరం బుధవారం మార్కెట్‌లోని జీవీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అభిమానులు, జీవీఆర్ డైలీ మార్కెట్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లోకేష్ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

భీమవరం(ప్రకాశంచౌక్): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ పర్యటన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం భీమవరం కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు మంత్రి నారా లోకేష్ జిల్లా పర్యటన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి విద్య, వైద్య, పోలీస్, పంచాయతీ, ఫైర్, ఆర్ అండ్ బి, రెవెన్యూ, తదితర శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ శాఖ అధికారులు బందోబస్తు ప్లాన్ సిద్ధం చేయాలని తెలిపారు. ప్రోటోకాల్ ఏర్పాట్లను రెవెన్యూ అధికారులు పగడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర మంత్రులకు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, తదితరులకు ముందస్తు సమాచారాన్ని అందజేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఆర్‌ఓ మొగలి వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్ ఓ.భాను నాయక్, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణ శ్రీ,, ఆకివీడు సీఐ వి.జగదీశ్వర్‌రావు, ఉండి తహసిల్దార్లు కె.నాగార్జున, జి.సుందర్‌సింగ్, రావి రాంబాబు, సహాయ అగ్నిమాపక దళ అధికారి సీహెచ్ సూర్యప్రకాష్‌రావు, ఎంఈఓలు ఎస్.శ్రీనివాసరావు, బి.వినాయకుడు, బి.జ్యోతి, ఆర్‌అండ్‌బీ డీఈ ఈసీహెచ్ టీవీఎస్ ప్రసాద్, ఎంపీడీవో జీ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో లంకలకోడేరు పీహెచ్‌సీ రికార్డు

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించడంలో గ్రేడ్ వన్ ప్రథమ స్థానంలో నిలిచిందని డాక్టర్ ప్రతాప్ కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. ప్రతిరోజూ ఇన్పేషెంట్లకు, అవుట్ పేషెంట్లకు ల్యాబ్ టెస్టులు చేయడంలో, గర్భిణులకు ప్రసవాలు చేయడంతో రాష్ట్రంలో గ్రేడ్ వన్ ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఒక్క నవంబర్ నెలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పది ప్రసవాలు చేయడంతో కలెక్టర్ సీహెచ్ నాగరాణి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు సిబ్బందిని అభినందించారని పేర్కొన్నారు.

ప్రధాన రోడ్లకు మోక్షమెప్పుడో?

నిధులున్నా పనులు ఆలస్యం

ఆకివీడు: గ్రామాలను అనుసంధానం చేస్తూ ఉన్న ప్రధాన రహదారులు పలు చోట్ల మరమ్మతులకు నోచుకోలేదు. నిధులు మంజూరైనా పనులను ప్రారంభించడంతో మీనమేషాలు అధికారులు లెక్కపెడుతున్నారు. కొన్ని రహదారుల్లో తాత్కాలిక మరమ్మతులు చేసినా కొన్ని రోజులకే గుంతలు పడ్డాయి. మరమ్మతులు కొన్ని చోట్ల తూతూ మంత్రంగా జరిగినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కాళ్ల మండలంలోని కాళ్లకూరు గ్రామంలోని రాష్ట్ర రహదారి మరమ్మతు పనులు సక్రమంగా జరగలేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రతి నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ ప్రాంతంలో రహదారి మరమ్మతులు నాణ్యంగా లేకపోవడంతో మళ్లీ యథాస్థితికి చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా తారు అంతంత మాత్రంగానే వేయడంతో పలు చోట్ల మెటల్, చిప్స్ పైకిలేచిపోతున్నాయి. నియోజకవర్గంలో రోడ్డు మరమ్మతులకు సుమారు రూ. 4.50 కోట్లు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు.


ఆకివీడు: రూ. 26 కోట్ల మంజూరైనా పనులు ప్రారంభించని పెదకాపవరం-క్రొవ్విడి రహదారి.


అధ్వానంగా ఉన్న చెరుకుమిల్లి-అయిభీమవరం రోడ్డు.


కాళ్ళకూరు ప్రాంతంలో తూట్లు పడ్డ స్టేట్ హైవేకి తూతూమంత్రంగా మాట్లు వేసిన దృశ్యం

నిధులున్నా పనులు సున్నా

ఆకివీడు మండలంలోని ప్రధాన రహదారులైన పాములపర్రు-కొల్లేరు, పెదకాపవరం-క్రొవ్విడి, చెరుకుమిల్లి-అయిభీమవరం రహదారులకు నిధులు మంజూరైనా పనులు నేటికీ ప్రాంభించలేదు. క్రొవ్విడి రహదారి కం రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి రూ.26 కోట్లు మేర నిధులు మంజూరయ్యాయి. రిటర్నింగ్‌వాల్ సుమారు రెండు కిలోమీటర్ల మేర నిర్మించినప్పటికీ రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. వర్షం వస్తే ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే భయపడిపోతున్నామని చెబుతున్నారు. పెదకాపవరం-కొల్లేరు రోడ్డులో ఆక్రమణలు తొలగించి ఏడాది గడుస్తున్నా రోడ్డు పనులు ప్రారంభించలేదు. ఈ రహదారి నిర్మాణానికి రూ.22 కోట్ల మేర కేంద్ర రహదారుల నిధులు మంజూరయ్యాయి. ఆకివీడు-సిద్ధాపురం రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు కూడా నేటికీ ప్రారంభం కాలేదు. గతంలోనే ఈ రోడ్డుకూ నిధులు మంజూరయ్యాయి. స్టేట్ హైవేకి అనుసంధానంగా ఉన్న ఏలూరుపాడు-చెరుకుమిల్లి-అయిభీమవరం రోడ్డు విస్తరణ,అభివృద్ధి పనులు కూడా నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి, పనుల ప్రారంభానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు శంకుస్థాపన చేసినప్పటికీ నేటికీ పనులు ప్రారంభించలేదు.

సొంతూళ్లకు వచ్చేవారికి ఇబ్బందే

సంక్రాంతి పండుగలకు సొంత ఊర్ళు వచ్చే వారికి అధ్వానంగా ఉన్న ఆయా రోడ్లు దర్శనమిస్తాయి. పాడైపోయిన, నిర్మాణం చేపట్టని, మరమ్మతులు చేసి పాడైపోతున్న రోడ్లపై నుంచే బంధువులు వస్తారు. అయితే రోడ్డు గురించి తెలియక ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది.

అన్ని రోడ్లకూ నిధులిచ్చాం



గత జగన్‌ప్రభుత్వంలోనే నియోజకవర్గంలోని ప్రధాన రోడ్లన్నింటికీ నిధులు మంజూరు చేయించాం. చాలా రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. మరికొన్ని రోడ్ల నిర్మాణ పనులు నేటికీ చేపట్టలేదు. నిధులున్నా పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– పీవీఎల్ నర్సింహరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉండి

ఇబ్బందికరంగా చెరుకుమిల్లి రోడ్డు



ఏలూరుపాడు నుండి చెరుకుమిల్లి-అయిభీమవరం వరకూ రోడ్డు అధ్వానంగా ఉంది. మరమ్మతులు చేసినా ఇబ్బందిగానే ఉంది. రోడ్డు విస్తరణపనులకు నిధులు మంజూరైనప్పటికీ నేటికీ పనులు చేపట్టలేదు. పంచాయతీ నుంచి మండల సమావేశాలల్లో ఆర్ అండ్ బీ అధికారులకు పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– నందమూరి ప్రకాశం, సర్పంచ్, చెరుకుమిల్లి

అధ్వానంగా అప్పారావుపేట రోడ్డు



మారుమూల గ్రామం అప్పారావుపేట గ్రామానికి రాకపోకలు తీవ్ర ఇబ్బందికరంగా ఉన్నాయి. గుమ్ములూరు-అప్పారావుపేట రోడ్డు అధ్వానంగా ఉంది. వాహనదారులకు ప్రమాదాలు తప్పడంలేదు. పండగకు బంధువులు రావాలంటే భయపడే పరిస్థితి ఉంది.

– మల్లారెడ్డి శేషమోహనరంగారావు, అప్పారావుపేట

బియ్యం సేకరణ వేగవంతంగా జరగాలి

భీమవరం: బియ్యం సేకరణ వేగవంతంగా జరగాలని అధికారులున్లు జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాలోని ఉన్న 14 గిడ్డంగులు యజమానులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్ మిల్లుల్లో బియ్యాన్ని త్వరితగతిన గిడ్డంగుల్లో దిగుమతి చేసేందుకు అవసరమైన హమాలీలను ఏర్పాటు చేసుకుని బియ్యం దిగుమతికి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. గిడ్డంగుల నిర్వహణలో ఏటువంటి అవకతవకలు లేకుండా సమగ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని సంబంధిత ఇన్వెస్టింగ్ గిడ్డంగులు వారితో సంప్రదింపులు జరిపి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒప్పందం కుదుర్చుకుని ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్వహణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని ఎస్‌డబ్ల్యూసీ రీజినల్ మేనేజర్‌ను జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ డీఎం టి శివరామ ప్రసాద్, రీజనల్ మేనేజర్ జి భానుమూర్తి, గిడ్డంగుల యజమానులు పాల్గొన్నారు.


భీమవరంలో గిడ్డంగుల యజమానులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

మహిళాభ్యుదయవాది సావిత్రి బాయి

భీమవరం: భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా భీమవరం పొట్టిశ్రీరాములు మునిసిపల్(పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్లో అరసవల్లి ఈశ్వరమ్మ- వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా వబిలిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ సాంప్రదాయాలు, కట్టుబాట్లు పేరుతో స్త్రీలను అణచివేసే వ్యవస్థ నుంచి బయటకు తీసుకు వచ్చి విద్యా ప్రోత్సాహం అందజేసి సముచిత న్యాయం కల్పించిన సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలేనని కొనియాడారు. స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు కె అన్నామణి, గుత్తుల సౌజన్య, ఎండీ అహ్మదున్నీసా, ఎం భాగ్యలక్ష్మి, ఐ మెర్సీ ఎలిజిబెత్‌లను జ్ఞాపికలతో, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, మాజీ కౌన్సిలర్ ఎంఏ నౌషాద్, లక్కోజి సత్యనారాయణ శర్మ, చైతన్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


భీమవరం పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

లైఫ్ సర్టిఫికెట్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం: భీమవరం పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో జరుగుతున్న లైఫ్‌సర్టిఫికెట్స్ కార్యక్రమాన్ని శనివారం జిల్లా ట్రెజరీ ఆఫీసర్ ఎ గణేష్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్స్ అంతా లైఫ్‌సర్టిఫికెట్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనారోగ్యం కారణాలతో ఆఫీసుకు రాలేని పెన్షనర్స్ ఇళ్లకే వెళ్లి లైఫ్ సర్టిఫికెట్ ఇచ్చే సౌకర్యాన్ని పెన్షనర్స్ వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు గణేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో భీమవరం సబ్ ట్రెజరీ అధికారి రవివర్మ, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జేమ్స్, భీమవరం యూనిట్ అధ్యక్షుడు పాల్, కోశాధికారి సూర్యనారాయణ, సంయుక్తకార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


జిల్లా సబ్‌ట్రెజరీ అధికారి గణేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

సాంఘిక దురాచారాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

భీమవరం: విద్యార్థులు సాంఘిక దురాచారాల పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాసంస్థ చైర్మన్ ఎంఏ సోమశేఖర్ అన్నారు. శనివారం భీమవరం డీఎన్నార్ లా కళాశాలలో భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మాధక ద్రవ్యాల వినియోగం, మానవ అక్రమ రవాణా, మంచి-చెడు స్పర్శలు, ర్యాగింగ్, బాల్య వివాహాలు, ఉచిత న్యాయ సహాయం వంటి అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు, లఘు చిత్రాలు, ఇన్‌స్టాగ్రాం రీల్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి అవగాహన పోటీల్లో విద్యార్థులు తరచూ పాల్గొని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి ఎం సుధారాణి, జూనియర్ డివిజన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి సురేష్‌బాబు, 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ డి ధనరాజు, కళాశాలల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు, లా కళాశాల కో ఆర్డినేటర్ ఎంవీ కృష్ణంరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, ప్రధాన కార్యదర్శి అడపాల ప్రసన్నకుమార్, ప్యానల్ న్యాయవాదులు ఎన్ సుధీర్, పి అంబేడ్కర్, కె జ్యోతి, ఎంబీ భవాని, అధ్యాపకులు చెల్లబోయిన రంగారావు, భాస్కరరావు, అమూల్యరావు, విజయవాణి తదితరులు పాల్గొన్నారు.


భీమవరం డీఎన్నార్ లా కళాశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జడ్జి సోమశేఖర్

భీమవరంలో విజేత సూపర్ మార్కెట్ బ్రాంచ్ ప్రారంభం

భీమవరం: వ్యాపారులు నాణ్యమైన సరుకులను సరసమైన ధరలకు విక్రయించడం ద్వారా వినియోగదారులమన్ననలు పొందాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం టుటౌన్ ప్రాంతంలోని జువ్వలపాలెం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విజేత సూపర్ మార్కెట్‌ను శనివారం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. విజేత సూపర్ మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్ జగన్మోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ సందీప్ చౌదరి, హర్షవర్ధన్ మాట్లాడుతూ గత 26 ఏళ్లుగా వినియోగదారుల ఆదరాభిమానాలతో తమ సంస్థ 115 స్టోర్స్‌తో ముందుకు సాగుతుందన్నారు. 1999లో మొదటి బ్రాంచ్‌తో సూపర్‌మార్కెట్ వ్యాపారం ప్రారంభించగా పశ్చిమ గోదావరిలో 2వ బ్రాంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్ధసారధి, కోళ్ల నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.


విజేత సూపర్‌మార్కెట్‌ను ప్రారంభిస్తున్న రఘురామకృష్ణంరాజు, అంజిబాబు

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

ఆకివీడు: ప్రశ్నించే, సూచించే హక్కు విద్యార్థులకు ఉందని డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నభోజనం తయారీలో, మెనూలో లోపాలుంటే విద్యార్థులు తెలియజేయాలన్నారు. భోజనపథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకం పేరు పెట్టడానికి ఆమె అన్నపూర్ణగా చేసిన సేవలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సుజాత, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు నంబూరి వెంకట్రామరాజు(బాబు), డాక్టర్ పీబీ.ప్రతాప్ కుమార్, మోటుపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

వీరవాసరం: మండలంలోని వీరవాసరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను, ఉత్తీర్ణత శాతాన్ని పెంచడం, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతిష్టాత్మకంగా మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు గుండా జయ ప్రకాష్ నాయుడు, మండల పరిషత్తు అధ్యక్షురాలు వీరవల్లి దుర్గ భవాని, ఎంపీటీసీ సభ్యురాలు జి.విజయలక్ష్మి, మెంటే పార్ధసారధి, ఇందుకూరి రామలింగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ వీవీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు

ఉండి: వరిసాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఉండిలో పర్యటించిన ఆయన రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సిబ్బందికి ఆన్‌లైన్ యాప్‌లపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రైతులు, సిబ్బంది సమక్షంలో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించి స్వయంగా ఆయన పంట నమోదు చేశారు. అనంతరం మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పద్ధతులు మరింతగా తెలుసుకుని వాటిలో సాంకేతిక జోడిస్తే అధిక దిగుబడులు సాధించగలరని అన్నారు. సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు ఎలా సాధించాలో? వ్యవసాయాధికారుల వద్ద సూచనలు సలహాలు తీసుకోవాలని కోరారు. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు పాటించి రైతులు నష్టపోవద్దని సూచించారు. నారుమడుల యాజమాన్యం నుంచి ఎరువుల వినియోగం వరకు అన్నింటా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉండిలో రైతులు, వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి వెంకటేశ్వరరావు.

వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

నరసాపురం: సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణంలో వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంటకరమణ అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె మున్సిపల్ కార్యాలయంలో ఎలక్ట్రికల్ సెక్షన్‌ను తనిఖీ చేశారు. ఎల్ఈడీ లైట్లు స్టాకు ఎంత వరకూ ఉంది? ఎక్కడైనా లైట్లు మరమ్మతులు చేయాల్సి వస్తే సరిపడగా సామగ్రి అందుబాటులో ఉందా? అనే అంశాలను ఆరా తీశారు. పండుగకు దూరప్రాంతాల నుంచి సొంతూళ్లకు పెద్ద ఎత్తున ప్రజలు వస్తారని, దీనిని దృష్టిలో పెట్టుకుని వీధిదీపాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పారా లీగల్ వలంటీర్లు బాధ్యతగా పని చేయాలి

నరసాపురం: న్యాయసేవాధికార సంస్థ ద్వారా నియమితులైన పారా లీగల్ వలంటీర్లు బాధ్యతతో పని చేయాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ సూచించారు. శనివారం పారా లీగల్ వలంటీర్లకు కోర్టు వద్ద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి విజయదుర్గ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల ప్రజలకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి చట్టాలపై న్యాయసేవా కార్యకర్తలు అవగాహన కల్పించాలని చెప్పారు. సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు సంబంధించిన వివాహాలు, వాటి చట్టాలపై అవగాహన కల్పించారు. వివాహాలను కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేయించేలా అవగాహన కల్పించాలని చెప్పారు. జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ ఎఫ్ఐఆర్ ప్రాముఖ్యత, అరెస్టులు, బెయిల్స్, ముద్దాయిల హక్కులు, గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. శిక్షణ తీసుకున్న పారాలీగల్ వలంటీర్లకు గుర్తింపు కార్డులు జడ్జి విజయదుర్గ అందించారు.

తాగునీటిని అందించేందుకు కృషి చేయాలి

ఆకివీడు: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేసే విధంగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సీపీఎం జిల్లా మహాసభలో ఆకివీడు ఏరియా నాయకుడు బి.వర్మ డిమాండ్ చేశారు. జిల్లా మహాసభలు శనివారం భీమవరంలో జరిగాయి. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు గుక్కెడు మంచినీటిని కొనుగోలు చేసి తాగాల్సి వస్తుందన్నారు. గోదావరి నుంచి స్వచ్ఛమైన జలాలు గ్రామాలకు చేరడంలేదన్నారు. ఆకివీడు పరిసర ప్రాంతాల్లో దొంగతనాలు పెరిగిపోయాయని, రౌడీమూకల ఆగడాలకు అంతేలేదని, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని మహాసభలో ప్రస్తావించామన్నారు. తాళ్లకోడు కాలనీని ఆకివీడు నగర పంచాయతీలో విలీనం చేసే విధంగా కృషి చేయాలని, ఆయా సమస్యలపై భవిష్యత్‌లో పోరాటాలు ఉధృతం చేస్తామని వర్మ విలేకరులకు వివరించారు. మహాసభల్లో తనతో పాటు సందక ఉదయ కుమారి పాల్గొన్నారని చెప్పారు.


భీమవరంలో జరిగిన సీపీఎం జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న వర్మ

జిన్నూరులో రెవెన్యూ సదస్సు

పోడూరు: రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను 45 రోజుల్లో పరిష్కరిస్తామని స్థానిక తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ అన్నారు. జిన్నూరు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో రైతుల నుంచి అధికారులకు 10 వినతులు అందాయి. కార్యక్రమంలో సర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి, ఆర్ఐ కె.రాంబాబు పాల్గొన్నారు.